క్లుప్తంగా

కనుమ పెద్దమ్మకు ఎమ్మెల్యే పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

అవుకు: మండల పరిధిలోని కునుకుంట్ల రహదారిలో వెలసిన కనుమ పెద్దమ్మకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి విన్నవం మేరకు కేశఖండన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కాటసాని, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, అవుకు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి ముందుగా అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ



ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామంలో జలజీవన్ మిషన్ కింద చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో 60 వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ట్యాంకు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 30 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, అంకిరెడ్డి, మదార్‌సా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

డోన్ టౌన్ : ఆర్థిక ఇబ్బందులతో సతమతమైవుతున్న పట్టణంలోని నెహ్రూనగర్ కాలనీకి చెందిన యాకోబుకు 21వ వార్డు కౌన్సిలరు షాదిక్ ఆర్థిక సాయం చేశారు. సైకిల్ రిపేరీ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునే యాకోబు మొదటి కుమార్తె అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరింది. ఆర్థిక సమస్యను తెలుసుకున్న షాదిక్ తనవంతు సాయంగా రూ. 5 వేలు అందజేశారు. ఈ మేరకు శనివారం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆదాం, వలంటీర్లు స్యాముల్, పార్వతీ ఆసుపత్రికి వెళ్లి యాకోబు కుమార్తెకు నగదు అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణం నాణ్యతగా చేపట్టండి



పనులపై చర్చిస్తున్న నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని శేషారెడ్డి నగర్‌లోని ధరణి టౌన్ షిప్పులో రూ. 40 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డబుల్ రోడ్డు పనులను కౌన్సిలర్ చింతల నాగిరెడ్డితో కలిసి చైర్మన్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయడమే కాకుండా, క్యూరింగ్ బాగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బాబా హుసేన్, ఏఈ శేఖర్ బాబు, నాయకులు మునిస్వామి, సయ్యద్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



టిప్రస్ కాలనీని పరిశీలిస్తున్న, రాజేష్

డోన్ : పట్టణ శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక టిప్రస్ కాలనీ, ఆర్‌ఈ రవికుమార్ కాలనీల్లో శనివారం కౌన్సిలర్ కటికె వేణు, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్‌లతో కలిసి చైర్మన్ పర్యటించారు. విద్యుత్, మంచినీటి సౌకర్యం లేనందున ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు విన్నవించగా పరిష్కార చర్యలు తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వ భూమిలో ఒక వ్యక్తి బోరు వేసి పంట పొలాలకు వినియోగిస్తున్నారని స్థానికులు చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఈ బోరును వెంటనే స్వాధీనం చేసుకుని ఈ ప్రాంత ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని డీఈ రసూల్‌ను చైర్మన్ ఆదేశించారు.

అదనపుకట్నం వేధింపుల కేసు నమోదు

కోవెలకుంట్ల: అదనపుకట్నం కోసం వేధిస్తుండటంతో బాధితురాలు శనివారం పోలీసులను ఆశ్రయించింది. కోవెలకుంట్ల ఎస్‌ఐ వెంకటరెడ్డి సమాచారం మేరకు.. పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న తంబళ్ల శ్రీలలితను కర్నూలు నగరానికి చెందిన ముఖేష్‌తో 2022 ఏప్రిల్‌లో వివాహం జరిగింది. అయితే కొన్నిరోజుల నుంచి అదనపు కట్నం తేవాలని భర్తతో పాటు అత్త రామసుజాత, మామ శంకరయ్య, ఆడపడుచు నిఖిత ఆమెను మానసికంగా శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారు. పుట్టింటికి చేరుకున్న శ్రీలలిత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నలుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

‘వరి’ంచిన లాభాలు!

- ఎకరాకు 40 బస్తాలకుపైగా దిగుబడులు
- గతేడాది కంటే రూ. 900 వరకు పెరిగిన గిట్టుబాటు ధర
- కొనుగోలు చేసేందుకు పోటీ పడుతున్న వ్యాపారులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



వరికోత మిషన్ ద్వారా పంట నూర్పిడి చేస్తున్న దృశ్యం

బనగానపల్లె : ప్రభుత్వ చేయూత, అధికారుల సూచనలు సాగు సంతృప్తిగా సాగుతోంది. పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు అమ్ముకునే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుండడంతో వ్యవసాయం పండుగలా సాగుతుంది. ప్రత్యేకించి ఏయేడాది వరి సాగు సిరులు కురిపిస్తుంది. గతంలో ఎన్నడులేని విధంగా ఈ సంవత్సరం ఖరీఫ్‌లో సాగు చేసిన వరి సాగు రైతులను లాభాలు వరిస్తున్నాయి. అధిక దిగుబడితో పాటు గిట్టుబాటు ధర చేకూరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సార్‌బీసీ, బోర్లు, ఇతర సాగునీటి సౌకర్యం ఆధారంగా బనగానపల్లె నియోజకవర్గంలో దాదాపు 6, 800హెక్టార్లలో వరి పంట సాగు అయినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఒక్క బనగానపల్లె మండలంలోనే దాదాపు 1,800 హెక్టార్లలో ఈ పంటను సాగు చేశారు. రెండువారాల కింద కోతలు మొదలవ్వగా ప్రస్తుతం ఊపందుకున్నాయి. అనుకున్నదానికంటే ఎక్కువగా దిగుబడులు రావడం, గిట్టుబాటు ధర మెరుగ్గా ఉండడంతో లాభాలు మూట కట్టుకుంటున్నారు రైతులు.

అధికంగా నంద్యాల సోనా సాగు

రైతులు అత్యధిక విస్తీర్ణంలో నంద్యాల సోనా వరి పంటను సాగు చేశారు రైతులు. కొంతమేర బీపీటీ 5204 (కర్నూలు సోనా) వరి పంటను కూడా సాగైంది. ఈయేడు వర్షాపాతం సమోదు తక్కువ కావడంతో వాతావరణం అనుకూలించింది. వరి పంటను చీడపీడలు తక్కువగా ఆశించడంతో సాగు ఖర్చులు కొంతమేర తగ్గాయి. దిగుబడులు సైతం గతేడాది కంటే ఎక్కువగా వచ్చాయి. గతేడాది నంద్యాల సోనా ఎకరానికి 30–35 క్వింటాళ్ల దిగుబడి రాగా బస్తా (75 కిలోలు) రూ.1,500–1,600 గిట్టుబాటు ధర లభించింది. బీపీటీ 5204 కూడా అదే విధంగా దిగుబడి లభించి రూ.1,300–1,400ల గిట్టుబాటు ధర లభించింది. అయితే ఈయేడు నంద్యాల సోనా ఎకరానికి 40–43 బస్తాల దిగుబడి లభిస్తుండగా బస్తాకు రూ.2,400–2,500లు గిట్టుబాటు ధర లభిస్తుంది. బీపీటీ 5204 రకం బస్తా రూ.1,900–2,100 గిట్టుబాటు ధర లభిస్తుండగా దిగుబడి మాత్రం 40 బస్తాలు వచ్చినట్లు రైతులు తెలిపారు.

ఎకరాకు రూ.40వేలు మిగులు

గతేడాది నిరాశపరిచిన వరి రైతులను ఇప్పుడు లాభాలు వరించాయి. ఎకరానికి రూ.40–50వేలు ఆదాయం లభిస్తున్నట్లు రైతులు అంటున్నారు. దుక్కి సేద్యాలు, నారుమళ్ల తయారు, నాట్లు, వ్యవసాయ కూలీలు, క్రిమిసంహారక మందులు తదితరు పెట్టు బడులు ఎకరానికి రూ.40వేలు ఖర్చు అయ్యాయని అంచనా. మంచి దిగుబడులు, గిట్టుబాటు ధరతో రూ.90వేల వరకు లాభం వస్తుంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులు సైతం వరి లాభాలు చేకూర్చింది. ఎకరానికి రూ.20–25వేల మిగులు ఉన్నట్లు కౌలు రైతులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలుకు సన్నాహాలు చేపట్టగా ప్రైవేట్ వ్యాపారులు సైతం పోటీ పడుతున్నారు. ముందుగానే నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు ప్రైవేట్ వ్యాపారులు.

నలభై బస్తాల దిగుబడి



ఐదు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ఎకరానికి 43 బస్తాల దిగుబడి లభించింది. బస్తాపై రూ.2,400 గిట్టుబాటు ధర లభించింది. పెట్టుబడిపోను ఎకరానికి రూ.50 వేల వరకు మిగులు లభించింది. పదేళ్లుగా వరి సాగు చేస్తూనే ఉన్నా. ఎప్పుడు ఇంత లాభం రాలేదు. ఓ విధంగా ఆర్థిక కష్టాలు తీరాయి.

– పి. వెంకటేశ్వర్లు, రైతు, కాపులపల్లె, బనగానపల్లె మండలం

వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి



ఈయేడు ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట రైతుకు లాభసాటిగా మారింది. అనుకూలించిన వాతావరణ పరిస్థితులలో దిగుబడులు బాగా వచ్చాయి. గిట్టుబాటు ధర కూడా గతేడాది కంటే బస్తాపై రూ.800 నుంచి రూ. 900 వరకు అధికంగా లభించింది. రైతులు చాలా సంతోష పడుతున్నారు.

– సుబ్బారెడ్డి, ఏఓ, బనగానపల్లె మండలం

తీరిన తాగునీటి సమస్య



మోటార్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో వర్షాభావ పరిస్థితుల వల్ల బోరుబావుల్లో భూగర్భ జలాలు ఇంకిపోయి తాగునీటి సమస్య తలెత్తడంతో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి చొరవ తీసుకొని కొత్త బోరు వేయించారు. బోరులో రెండున్నర ఇంచు నీరు పడటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం బోరుబావిలో మోటార్ ఏర్పాటు చేసి సర్పంచ్ గుమ్మగాల రాజు, మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి తాగునీటిని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులను కించపరచడం తగదు

సంజామల: సచివాలయ ఉద్యోగులను కించపరిచేలా అంగన్‌వాడీలు మాట్లాడడం తగదని నంద్యాల జిల్లా మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అత్తర్ గౌసియా ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ముదిగేడు సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె నేపథ్యంలో అధికారులు వారి విధులను ప్రత్యామ్నాయంగా సచివాలయ సిబ్బందికి అప్పగించారన్నారు. అనుచిత వాఖ్యాలు చేయడం, దూషించడం సరికాదన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శనివారం సొసైటీ చైర్మన్ అంబటి రామసులోచన, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డితో కలిసి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి భూమి పూజ చేశారు. సొసైటీ ప్రధాన రహదారి చెంతనే ఉండటంతో ఐదు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.13.50 లక్షలు మంజూరు చేసిందని ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేసిందన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తు రుణ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో చాలా సంఘాలు లాభాల దిశగా పయనిస్తున్నాయన్నారు. గతంలో రుణాలు, రికవరీలకే పరిమితం కాగా ప్రస్తుతం మినీ బ్యాంక్‌లు, కామన్ సర్వీస్ సెంటర్లుగా సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అవుకు కో–ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ దాండ్‌బాషా, కొలిమిగుండ్ల, హనుమంతుగుండం సొసైటీ సీఈఓలు కేశవర్ధన్, సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు నాగేష్, హుసేన్‌వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు గురివిరెడ్డి, ముల్లు శివరామసుబ్బారెడ్డి, బీగాల వెంకటసుబ్బయ్య, కామిని గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న అయ్యప్ప స్వామి మాలధారులు

డోన్ టౌన్ : స్థానిక తత్వమసి అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారికి మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటాలానే మూడవ శనివారం పూజలు నిర్వహించేందుకు వేలం దక్కించుకున్న కన్య స్వాములు అభిషేకాలు, అర్చనలు, హోమాలు, పూలాభిషేకాలు నిర్వహించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం మాలధారులతోపాటు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వామి మాలధారులు అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి పట్టణ పురవీధుల గుండా ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక దేవాలయం నుండి ఉత్సవమూర్తిని ట్రాక్టరులో ఉంచి కేరళ రాష్ట్రం నుంచి రప్పించిన ప్రత్యేక కళాకారుల డప్పు వాయిద్యాల మధ్య కన్యస్వాములు భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రతి కుటుంబానికి పని కల్పించాలి

- ఉపాధి పనులను వేగవంతం చేయాలి
- పీడీ రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి పథక పీడీ రామచంద్రారెడ్డి

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలని పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల, దొర్నిపాడు మండలాల ఏపీఓలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీలతో నిర్వహించిన క్లస్టర్‌స్థాయి సమావేశంలో పీడీ మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఇప్పటి వరకు 70 నుంచి 80 పనిదినాలు పూర్తి చేసుకున్న ఎస్సీ, ఎస్టీలతోపాటు మిగిలిన కుటుంబాలకు వంద పనిదినాలు కల్పించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోకపోతే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ సాంబశివరావు, డీబీటీ వేణు, ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఏపీఓలు శ్రీవిద్య, ప్రకాష్‌రావు, గంగన్న, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబు!

- రూ.2.39 కోట్లతో నిర్మించిన నూతన భవనాలు పూర్తి
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: గ్రామీణుల చెంతకు పాలన అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆయా గ్రామాల్లోనే సచివాలయాలను ఏర్పాటు చేశారు. సచివాలయాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు విస్తృతంగా సేవలందుతున్నాయి. ఈ మేరకు నిర్మించిన నూతన భవనాలు ముస్తాబయ్యాయి. ఈ భవనాలతోపాటు అభివృద్ధి పనులను ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించనున్నారు. రామాపురం-2, సంగపట్నం గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. అంతేకాకుండా పాఠశాలలకు కాంపౌండ్ వాల్, సీసీ రోడ్ల నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి. సంగపట్నం గ్రామంలో రూ.38.4లక్షలతో గ్రామ సచివాలయం, రూ.23.94లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.8లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్, రూ.26లక్షలతో జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీ నిర్మాణం పూర్తయ్యింది. అలాగే రామాపురం–2 గ్రామ సచివాలయ పరిధిలో రూ.40లక్షలతో గ్రామ సచివాలయం, రూ.23.94లక్షలతో రైతు భరోసా కేంద్రం, అదేవిధంగా రూ.40లక్షలు గడపగడప నిధులతో సీసీ రోడ్లు, రూ.26లక్షలతో జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీ నిర్మాణం పూర్తికావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, బల్బులు తదితర వసతులు పూర్తి చేశారు. ఇప్పటి వరకు ప్రైవేటు భవనాల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్త భవనాలు ప్రారంభమైతే అన్ని సౌకర్యాలు ఉంటాయి.

నేడు రామాపురం బహిరంగ సభ

అవుకు మండల పరిధిలోని సంగపట్నం, రామాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి శనివారం తెలిపారు. రెండు గ్రామాల్లో రూ.2.39కోట్లతో జరిగిన అభివృద్ధి పనులను ప్రారంభించి రామాపురం గ్రామంలో బహిరంగ సభ నిర్వహిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



రూ.40 లక్షలతో పూర్తయిన రామాపురం–2 గ్రామ సచివాలయం



రూ.23.94 లక్షలతో నిర్మించిన సంగపట్నం రైతుభరోసా కేంద్రం



రూ.20.8లక్షలతో నిర్మించిన సంగపట్నం వెల్‌నెస్ సెంటర్

సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సంక్షేమ పథకాలకు సంబంధించిన బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తుందని, పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని 4వ గ్రామ సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఈసారి యల్లమ్మ, జెడ్పీటీసీ సుబ్బలక్ష్మమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ దీవెనమ్మ, ముస్లిం షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, భానుముక్కల సహకారం సంఘం చైర్మన్ నీలీ శ్రీనివాసులు, ఎంపీటీసీలు వెంకటసుబ్బయ్య, తహెర్‌లతో కలిసి పింజరి పేట, ఎస్సీ కాలనీలో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పార్టీలు, కులాలు, వర్గాలకు అతీతంగా ప్రభుత్వ ఫలాలు నేరుగా అందజేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తున్నారని గుర్తు చేశారు. వైద్య, విద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేదుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యకరమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఎంఈఓ స్వరూప, పీఆర్ ఏఈ మహేష్, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, గ్రామపంచాయతీ ఈఓ ఖలీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్దుల్‌ఫైజ్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, కిశోర్, నారాయణ, తీర్థంరెడ్డి, నూకల వెంకటసుబ్బయ్య, గాథంశెట్టి వేణుగోపాల్, జీవీ కృష్ణ, మహ్మద్‌గౌస్, సునార్ ఎక్బాల్, మధు, సాదిక్, శ్రీరాములు, జీటీ వెంకట్రామిరెడ్డి, ప్రసాద్, అబ్బాస్, రఫీ, ఉప్పరి మద్దిలేటి, చాకలి శ్రీను, రామసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయించండి...

ఏళ్ల తరబడి ఇరుకు ఇళ్లలో ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నామని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయించాలని ఆయా కాలనీల ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు గృహాలు నిర్మిస్తుందని, తమకు మాత్రం అన్యాయం జరిగిందని పేదలు ఎమ్మెల్యే ఎదుట మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే కాటసాని...బనగానపల్లె పట్టణానికి ఏకంగా మూడు వేల మందికి ఇళ్ల స్థలాలను పంపిణీకి తాను సర్వం సిద్ధం చేయగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి అడ్డుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుంటి సాకులు చూపుతూ కోర్టులో కేసు వేయించి ఇళ్ల స్థలాల పంపిణీ జరకుండా అడ్డుకట్ట వేశారని విచారం వ్యక్తం చేశారు. అయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మీ పక్షాన నేనున్నాని, న్యాయమే గెలుస్తుందని, పేదల సొంతింటి కల నెరవేరుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని భరోసా ఇచ్చారు.

గ్రామాలపురోభివృద్ధికి కృషి

బేతంచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల పురోభివృద్ధికి కృషి చేస్తున్నాయని గూటుపల్లె గ్రామ సర్పంచ్ ఏస్వేరమ్మ, తవిసికొండ సర్పంచ్ బండ కాటి లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ రంగస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని గూటుపల్లె, తవిసి కొండ గ్రామంలో ఎంపీడీఓ వెంగన్న, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల అభివృద్ధితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు.

బిస్కట్ల అంగడి దగ్ధం

డోన్‌టౌన్: పట్టణంలోని పాతపేటకు వెళ్లే రహదారిలోని రైల్వే గేట్ల వద్ద ఉన్న బిస్కట్ల అంగడిలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో దగ్ధమైంది. రూ. 4 లక్షల బిస్కట్లు, సిగరెట్లు, తినుబండరాళ్లు అగ్నికి ఆహుతి అయినట్లు బాధితుడు షేక్ మస్తాన్ వలి శనివారం తెలిపారు. వివరాల మేరకు శుక్రవారం రాత్రి వ్యాపారం ముగించుకొని తాళం వేసి ఇంటికి వెళ్లానన్నారు. అర్ధరాత్రి అంగట్లో నుంచి పొగలు వస్తుండటంతో స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెళ్లగా మంటలు చెలరేగాయన్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి మంటలను అదుపు చేశారు.

లాభసాటిగా ఏటీఎం మోడల్ సాగు



ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేసిన టమాటను పరిశీలిస్తున్న, డీపీఎం సలాం

బనగానపల్లె రూరల్ : ఏటీఎం మోడల్ పద్ధతి సాగు లాభసాటిగా ఉంటుందని, రైతులు ఆ దిశగా ముందుకు సాగాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా అడిషినల్ ప్రాజెక్టు మేనేజర్ సలాం సూచించారు. బనగానపల్లెకు చెందిన రైతు సుబ్బన్న ఏటీఎం మోడల్ పద్ధతిలో సాగు చేసిన పొలాన్ని శనివారం మండల సమైఖ్య సంఘాల మహిళాలతో కలిసి సందర్శించారు. కేవలం 30 సెంట్లలో సుమారు 15 రకాల ఆకుకూరలు, కూరగాయలను ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేసిన రైతు సుబ్బన్నను డీపీఎం అభినందించారు. ఈ అంశాన్ని మండల సమైఖ్య సమావేశంలో చర్చిస్తామని డీపీఎం సలాం చెప్పారు. అలాగే ఏటీఎం మోడల్ సాగు పద్ధతిలో పండించిన పంటలకు మార్కెటింగ్‌ను మండల సమైఖ్య సంఘాల ద్వారా చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు ఈ పద్ధతిలో సాగు చేపట్టి లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు హుస్సేన్‌బీ, కోశాధికారి జుబేదా, సెక్రటరీ నాగలక్ష్మీ, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ మున్ని తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటయ్య ఆలయాభివృద్ధికి రూ. లక్ష విరాళం



మద్దిలేటి స్వామి ఆలయ అభివృద్ధికి నగదు అందజేస్తున్న, దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివార్లో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి నంద్యాల జిల్లా, నందికోట్కూర్ మండలం బ్రాహ్మణ కోట్కూర్ గ్రామానికి చెందిన నుంకన్న కుమారుడు చిన్నయ్య రూ. 1,01,150 విరాళం అందజేశారు. అదేవిధంగా కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి కుమారుడు మల్లికార్జున రెడ్డి రూ.80 విలువ చేసే గోద్రేజ్ సేఫ్టీ లాకర్‌ను వితరణ చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవల ద్వారా రూ.5,27,855 ఆదాయం వచ్చినట్లు ఈఓ, పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన మద్దిలేటయ్య క్షేత్రం

మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేకువజామునుంచే భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిలిండర్ల ఆటో బోల్తా

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని వెంకటాపురం రోడ్డులో జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం నిండు గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. సిలిండర్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఆ సమయంలో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు ఎక్కువ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు చర్చించుకున్నారు.